

నాడు



ఎమ్మిగనూరులోని గోనెగండ్ల సర్కిల్‌లో గుంతలమయంగా మారిన ఎమ్మిగనూరు-కర్నూలు ప్రధాన రహదారి

నేడు



టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతులు చేపట్టడంతో అందంగా కనిపిస్తున్న రోడ్డు

- వైసీపీ హయాంలో రోడ్లు అస్తవ్యస్తం
- ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో మోక్షం
- ఉమ్మడి జిల్లాలో మరమ్మతులకు రూ.234.08 కోట్లు
- 95 శాతం పూర్తయిన పనులు

పల్లె రోడ్డు భళా..!

మారిన గ్రామీణ రహదారులు

ఉమ్మడి జిల్లాలో రోడ్లు మరమ్మతుల వివరాలు

రోడ్ల వివరాలు	కర్నూలు	నంద్యాల	మొత్తం
ఆర్ అండ్ బీ రోడ్లు (కి.మీలు)	429	359.74	788.74
వంతెనలు	10	13	23
నిధులు (రూ.కోట్లలో)	31.34	45.75	77.09
గ్రామీణ రోడ్లు (పనుల సంఖ్య)	837	1,026	1,863
నిధులు (రూ.కోట్లలో)	71.04	85.95	156.99

మిగతా 6వ పేజీలో

ఆరు నెలల క్రితం వరకు ఉమ్మడి జిల్లాలో అధ్వాన రహదారులు.. అడుగడుగునా గుంతలమయం. రోడ్డెక్కాలంటే భయపడే పరిస్థితి. వాహనదారులకు రాకపోకలు నరకప్రాయంగా మారాయి. గుంతల రోడ్లలో ప్రయాణం చేయలేక జనం పడిన అవస్థలు ఎన్నో. పల్లెసీమల రోడ్లే కాదు.. ప్రధాన రహదారులు సైతం దారుణంగా ఉండేవి. నిధుల లేమితో గంపెడు మట్టివేసి గుంతలు పూడ్చలేని దైన్యపరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్ల దుస్థితి ఇది. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొలువుదీరాక రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టిపై సారించింది. తొలి ప్రాధాన్యతగా గుంతల్లేని రహదారుల కోసం చర్యలు చేపట్టారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.77.04 కోట్లతో మరమ్మతులు, వంతెనల నిర్మాణాలు చేపట్టారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో రూ.156.99 కోట్లతో గ్రామీణ రోడ్ల మరమ్మతులు, కొత్త దారుల పనులు చేపట్టారు. దాదాపుగా 95 శాతం పనులు పూర్తయ్యాయని ఇంజనీర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాడు-నేడు రహదారులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కర్నూలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖ పర్యవేక్షణలో కర్నూలు జిల్లాలో 3,399.75 కిలోమీటర్లు, నంద్యాల జిల్లాలో 1,512.605 కిలోమీటర్లు వివిధ రహదారులు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారుల మరమ్మతులుఒ ఏమాత్రం పట్టించుకోలేదు. ఐదేళ్ల కనీసం మరమ్మతులు చేయకుండా గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వం అధ్వాన రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టిని సారించింది. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు చూస్తారంటూ ప్రభుత్వం ఏర్పాటైన తొలినాళ్లలో సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీనిచ్చారు. ఆ దిశగా అడుగులు వేసి ఇచ్చిన హామీని నెరవేర్చారు. నిధులు ఇచ్చి గుంతలు పూడ్చే పనులు చేపట్టి ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను పరుగులు పెట్టించారు. గుంతలు పూడ్చడంతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. ప్రజలు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో రూ.31.34 కోట్లతో 429 కిలోమీటర్లు, నంద్యాల జిల్లాలో రూ.45.75 కోట్లతో 359.74 కిలోమీటర్ల మరమ్మతు పనులు రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ల పర్యవేక్షణలో చేపట్టారు. ఇందులోనే 30 కోట్లుతో 23 బ్రిడ్జిలు (వంతెనలు) నిర్మాణాలు ఉన్నాయి. రహదారులు మరమ్మతులు 97 శాతం పూర్తి కాగా.. వంతెన పనులు వివిధ దశల్లో ఉన్నాయని ఇంజనీర్లు తెలిపారు.

గ్రామీణ రోడ్లకు మోక్షం

ఉమ్మడి జిల్లాలో ప్రధాన రహదారులే కాకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం గ్రామీణ దారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద ఉమ్మడి జిల్లాలో రూ.156.99 కోట్లతో 1,863 పనులు చేపట్టారు. పంచాయతీరాజ్ (పీఆర్) పర్యవేక్షణలో గ్రామాల మధ్య అనుసంధానం (కనెక్టివిటీ) రోడ్లు, అంతర్గతదారులు నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చారు. కర్నూలు జిల్లాలో రూ.71.04 కోట్లతో 837 పనులు, నంద్యాల జిల్లాలో రూ.85.95 కోట్లతో 1,026 పనులు చేట్టారు. 95 శాతం పనులు పూర్తి చేసి రాష్ట్రంలో మొదటి రెండు స్థానాలు కర్నూలు, నంద్యాల జిల్లాలు నిలిచాయి. అటు ప్రధాన రోడ్లు, ఇటు పల్లె దారులు బాగుపడడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 122 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో 122 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో సునీత తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షల్లో 1934 మంది విద్యార్థులకుగాను 184 మంది హాజరయ్యారని, 94 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి 5గంటల వరకు నిర్వహించిన పరీక్షల్లో 1317 మంది విద్యార్థులకు గాను 1289 మంది విద్యార్థులు హాజరు కాగా 28మంది గైర్హాజరయ్యారని వివరించారు.

గీత కార్మికులకు మద్యం షాపులు

లాటరీ ద్వారా 11 మంది ఎంపిక

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయించిన 11 మద్యం షాపులకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను లాటరీ విధానంలో చేపట్టారు. సోమవారం ఐదు మున్సిపాలిటీలైన నంద్యాల, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరులతోపాటు ఆరు మండలాలైన జూపాడుబంగ్లా, పగిడ్యాల, డోన్ రూరల్, ఉయ్యాలవాడ, కొత్తపల్లి, పాములపాడులకు సంబంధించి నంద్యాల కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో లాటరీ ప్రక్రియ చేపట్టారు. డీఆర్వో పర్యవేక్షణలో నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికుమార్ సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 11 మద్యం షాపులకు గాను 11 మందిని ఎంపిక చేశారు. మరో ఇద్దరు రిజర్వ్‌డు ఆర్1, ఆర్2 అభ్యర్థులను ఒక్కొక్క షాపునకు ఎంపిక చేశారు. విజయవంతమైన అప్లికెంట్స్‌కు ప్రొవిజనల్ లైసెన్స్‌ను అక్కడే జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికుమార్ అందజేశారు. లాటరీ కార్యక్రమానికి ప్రత్యేక పరిశీలకులుగా కర్నూలుకు చెందిన ఏసీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ హనుమంతరావు హాజరయ్యారు.



లాటరీ ప్రక్రియ నిర్వహిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికుమార్

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించండి

కలెక్టర్ రాజకుమారి

సున్నిపెంట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సున్నిపెంట ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు అత్యంత ప్రాముఖ్యత నిచ్చి సానుకూల దృక్పథంతో విధులు నిర్వహించాలన్నారు. మండల స్థాయి అధికారులు సరిగా పని చేయకపోవడం వల్ల ప్రతి పారా మీటర్‌లో గ్రామ స్థాయి అధికారులతో పని చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో చేపడుతున్న పింఛన్ల పంపిణీ, రీ సర్వే, మ్యుటేషన్ దరఖాస్తుల క్లియరెన్స్ తదితర అన్ని పనులు ఆర్టీజీఎస్ ద్వారా ప్రభుత్వం పరిశీలిస్తోందని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. 1500 మంది ఉద్యోగులు ఎంప్లాయిస్ హోల్డ్ డేటాలో తక్షణమే నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా పనులు ప్రారంభించి పెండింగ్‌లో ఉన్న రహదారి గుంతలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సుండిపెంటలో భూ ఆక్రమణలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణలు కొనసాగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని వారం రోజులలోపు వీటిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శివప్రసాద్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం

దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

శ్రీశైలం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం 3 గంటలపాటు శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కమాండ్ కంట్రోల్ రూములో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. హోల్డింగ్ ఏరియా, పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి అక్కడి నుంచి భక్తులను వారి అవసరాలకు తగ్గట్లు తరలించడానికి మొదటి సారిగా ప్రత్యేక మినీ వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లలో ఉచితంగా 200 ఎంఎల్ వాటర్ బాటిల్, పాలు, బిస్కెట్లు అల్పాహారం పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. బ్రహ్మోత్సవాల పర్వదినాలలో భాగంగా ఈ నెల 24, 25, 26, 27 తేదీలలో ఉచితంగా స్వామివారి లడ్డూ ప్రసాదం భక్తులకు అందించే విధంగా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సంవత్సరం భక్తుల సంఖ్య 30 శాతం పెరుగుతుందని, ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు ఆరు డ్రోన్ కెమెరాలను, పర్యవేక్షించేందుకు అవసరమైన మోటారు వాహనాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీకి సూచించారు. రెవెన్యూ, పోలీసు, దేవదాయ శాఖలు సమన్వయంతో పని చేసి ప్రముఖుల దర్శనాలకు టైంస్లాటు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, బీసీ జనార్దనరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ, పోలీసు, దేవదాయ శాఖలు పటిష్టమైన ప్రణాళికలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రుల బృందాన్ని నియమించడం ప్రత్యేకతను సంతరించుకుంది. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవదాయ శాఖ కమిషనరు రామచంద్రమోహన్, కలెక్టరు జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ చంద్రశేఖర ఆజాద్, దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, అటవీ శాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న మంత్రులు ఎమ్మెల్యే, అధికారులు











ఆల్బెండజోల్ మాత్రలను మింగించండి

కలెక్టర్ రాజకుమారి



విద్యార్థినికి మాత్రలు మింగిస్తున్న కలెక్టర్

సున్నిపెంట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో నులిపురుగుల నివారణకు వారితో ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని కలెక్టర్ రాజకుమారి ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా సున్నిపెంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కలెక్టర్ ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 1,950 ప్రభుత్వ పాఠశాలలు, 147 జూనియర్ కళాశాలలో చదువుతున్న 4,29,000 మంది విద్యార్థులందకీ ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో 192 అర్జీలు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కార్యక్రమం ద్వారా 192 అర్జీలు వచ్చినట్లు డీఆర్వో రామునాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేశారన్నారు. వచ్చిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరిస్తామని డీఆర్వో తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్, కలెక్టరేట్ ఏవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కోసిగి బీసీ కాలనీలో ఆరు నెలల క్రితం అధ్వానంగా ఉన్న రహదారి



కోసిగి బీసీ కాలనీ రోడ్డు ప్రస్తుతం మారిన తీరు..

నాడు బురద రోడ్లు.. నేడు సీసీ రోడ్లు

కోసిగి: గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేక రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. కానీ కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి రావడంతో రోడ్లదశ మారిపోయింది. పంచాయతీలకు నిధులు నేరుగా సర్పంచ్ ఖాతాల్లోకే రావడంతో సీసీ రోడ్లు వేస్తున్నారు. మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మండల పరిధిలోని కోల్‌మాన్‌పేటలో బీసీ కాలనీలో 15 సంవత్సరాలుగా సీసీ రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తర్వాత కూటమి ప్రభుత్వంలో సీసీ రోడ్లు వేయడంతో గ్రామానికే కళ వచ్చినట్లయిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల గ్రామంలోని పైవీధిలో ఆరు నెలల క్రితం అధ్వానంగా ఉన్న పరిస్థితి



అదే వీధిలో ప్రస్తుతం రహదారి పనులు

ఎమ్మిగనూరులో మారిన రోడ్లు

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల గ్రామంలోని పైవీధిలోని దృశ్యాలివి. ఈ వీధుల్లో ఏన్నో ఏళ్లుగా సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడేవారు. వర్షం వచ్చిందంటే వర్షపునీరు రోడ్లపై నిలిచి కనీసం నడిచేందుకు కూడా వీలులేకుండా ఉండేది. వీధుల్లో నీరు ఎక్కడికి వెళ్లకుండా స్తంభించిపోయి దోమలు ప్రబలి ఎంతో మంది ప్రజలు విష జ్వరాలబారిన పడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ రోడ్లపై దృష్టి సారించింది. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గ్రామాన్ని సందర్శించి రహదారి వేయించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆ గ్రామంలో సీసీ రోడ్డుతో పాటు డ్రైనేజీ పనులు చక చకా జరిగిపోతున్నాయి.



ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల గ్రామంలోని పైవీధిలో ఆరు నెలల క్రితం అధ్వానంగా ఉన్న రహదారి



అదే వీధిలో ప్రస్తుతం వేగంగా జరుగుతున్న రహదారి పనులు

పల్లె రోడ్డు భళా..!



నాడు మురుగు నీరుతో పచ్చగా మారిన రోడ్డు దుస్థితి



ప్రస్తుతం సీసీ రోడ్డు వేయడంతో అందంగా ఉన్న రోడ్డు

తీరిన వందేళ్ల కల

మద్దికెర: పత్తికొండ నియోజకవర్గం మద్దికెర గ్రామంలోని కవిరెడ్డి వీధి, మద్దమ్మ ఆలయ పరిసర ప్రాంతంలో వందేళ్లగా రహదారి సౌకర్యం లేదు. వీధిలో రాకపోకలు సాగించాలన్నా రైతులు వాముదొడ్లకు వెళ్లి పశువులకు మేత తేవాలన్నా ఎవరైనా చనిపోతే శ్మశానానికి తీసుకెళ్లాలన్నా.. ఆ ప్రాంతమంతా దుర్వాసనలో దుర్భర జీవితాలు సాగించేవారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, హెల్త్ కేంద్రం ఉన్నాయి. కానీ రోడ్డు లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు వేశారు. దీంతో ఆ ప్రాంతంలో వందేళ్ల కళ తీరింది. 'పల్లె పండుగ'లో భాగంగా రూ.10లక్షలతో సీసీ రోడ్డు వేశారు.

మంచి రోజులు వచ్చాయి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లపై దృష్టి సారించింది. గ్రామాలకు మంచి రోజులు వచ్చాయి. మా ప్రాంతాల్లో రోడ్లు వేయడం వల్ల దుర్వాసన తప్పిపోయింది. రోడ్లు అందంగా మారాయి.

-గౌడుగు సతీష్ కుమార్, మద్దికెర

ఎన్నో ఏళ్ల తర్వాత వేశారు



మా ప్రాంతంలో ఎన్నో ఏళ్ల తర్వాత రోడ్లు వేశారు. కవిరెడ్డి వీధి నుంచి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. చాలాదూరం చుట్టూ తిరిగి వెళ్లేవాళ్లం. ఇప్పుడు రోడ్డు వేయడంతో రాకపోకలకు బాగుంది. పాఠశాలలు, హెల్త్ కేంద్రాలు ఉండటంతో దుర్వాసన తప్పింది.

-కవిరెడ్డి కృష్ణ, మద్దికెర

నిధులు మంజూరు చేశాం



మద్దికెర మండలంలోని కవిరెడ్డి వీధి ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా రాకపోకలు నిలిచిపోవడమే కాకుండా మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసన వస్తుండేది. రూ.10 లక్షల నిధులు మంజూరు కావడంతో రోడ్డు వేయించాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూశాం.

- డి.అనిత యాదవ్, ఎంపీపీ, మద్దికెర



ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండలంలోని అగ్రహారంలో నాడు మురికి గుంటలా ఉన్న బీసీకాలనీ రోడ్డు



ప్రస్తుతం అదే కాలనీలో ఇలా సీసీ రోడ్డు



ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండలంలోని తిప్పనూరు ఎస్సీ కాలనీలో నాటి మట్టి రోడ్డు



అదే వీధిలో ప్రస్తుతం వేగంగా జరుగుతున్న రహదారి పనులు

పల్లెపండుగతో పల్లెల్లో అభివృద్ధి

గోనెగండ్ల: పల్లె పండుగ కార్యక్రమంలో బాగంగా కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండలంలోని అగ్రహారం, తిప్పనూరు ఎస్సీ కాలనీల్లో అధ్వానంగా ఉన్న రహదారులు నేడు సీసీ రోడ్లతో కళకళలాడుతున్నాయి.

మంత్రి ఇలాకాలో మారిన రోడ్లు

బనగానపల్లె: బనగానపల్లె మండలం రామతీర్థం గ్రామంలో ఎస్సీ కాలనీనుంచి మెయిన్ రోడ్డు వరకు గతంలో రహదారి అధ్వానంగా ఉండేది. ప్రస్తుతం ఆ కాలనీలో ప్రభుత్వం రోడ్లు వేయించింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో నియోజకవర్గ వ్యాప్తంగా రహదారులపై ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా సీసీ రోడ్లకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు.





నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం రామతీర్థం గ్రామంలో ఎస్సీ కాలనీ నుంచి మెయిన్ రోడ్డు వరకు నాడు-నేడు రహదారి పరిస్థితి

స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ పోస్టుల ప్రొవిజనల్ లిస్టు విడుదల

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌కు సంబంధించిన పోస్టుల రివైజ్డ్ ప్రొవిజనల్ మెరిట్ లిస్టును కర్నూలు, నంద్యాల జిల్లాల వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా.కే.చిట్టినరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. Https:kurnool.ap.gov.in మరియు Https:nandyal.ap.gov.in మరియు Https:kurnool medical college.ac.in వెబ్‌సైట్‌లోని అప్‌లోడు చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఈ జాబితాలో వివరాలు చూసుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11 నుంచి 15వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు లిఖిత పూర్వకంగా సమర్పించాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10: (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు సోమ వారం ప్రశాంతంగా జరిగాయి. 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 3,562 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. ఇందులో 3,445 మంది పరీక్షకు హాజరు కాగా, 117 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు మొత్తం విద్యార్థులు 2,892 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 2,839 మంది పరీక్షకు హాజరు కాగా 53 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాలను ఆర్‌ఐవో కన్వీనర్ గురువయ్య శెట్టి, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ సభ్యులు నాగభూషణంరెడ్డి, పద్మావతి పర్యవేక్షించారు.

వెండి రథంపై ఆదిదంపతుల విహారం


వెండి రథోత్సవంపై అమ్మవార్లు

శ్రీశైలం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో సోమవారం వెండి రథోత్సవం వైభవంగా సాగింది. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సాయంత్రం వెండి రథంపై అలంకరించి క్షేత్రవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేసి, అర్చకులు వేదమంత్రోచ్చరణలతో పూజలు జరిపారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

ఘంటసాలతో అనుబంధం మరచిపోలేనిది

సినీ రచయిత డాక్టర్ ఎంకే రాము

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావుతో ఉన్న అనుబంధం మరచిపోలేనిదని హైదరాబాదుకు చెందిన సినీ రచయిత డాక్టర్ ఎంకే రాము అన్నారు. సోమవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న ఘంటసాల ఆరాధనోత్సవాలు రెండోరోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీజీవీ కళాక్షేత్రం, కర్నూలు ఘంటసాల గాన కళాకమితి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాల్లో తొలుత ఘంటసాల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ ఎంకే రాము మాట్లాడుతూ డాక్టర్ సి. నారాయణరెడ్డి, నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావులతో కలిసి రసమయి సాహితీ సాంస్కృతిక సంస్థను స్థాపించి 57 ఏళ్లు అయిందని గుర్తు చేసుకున్నారు. గుండెవైద్య నిపుణులు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా హార్ట్ ఫౌండేషన్ ద్వారా నగరంలో ఘంటసాల సంగీత విభావరులు నిర్వహిస్తూ గాయకులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. సమావేశానికి అధ్యక్షత వహించిన టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రంలో నిత్య కల్యాణం పచ్చతోరణంలా సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వెనుక మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ కృషి, సహకారం ఎంతో ఉందని చెప్పారు. ఘంటసాల గాన కళాసమితి అధ్యక్షుడు బీఎస్ రావు మాట్లాడుతూ ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహించుకోవడంతోపాటూ వివిధ ప్రాంతాలకు చెందిన గాయకులతో సంగీత విభావరి నిర్వహించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని చెప్పారు.

అలరించిన సంగీత విభావరి: ఘంటసాల ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను మైమరపించింది. కాకినాడకు చెందిన సీవీ రమణ, హైదరాబాదుకు చెందిన అఖిల బృందం ఆలపించిన గీతాలు అలరించాయి. డాక్టర్ ఎంకే రాముతో పాటు గాయకులను ఘనంగా సత్కరించారు. కళాక్షేత్రం కార్యదర్శి మమ్మద్ మియా, ఇతర ప్రతినిధులు జీవీ శ్రీనివాసరెడ్డి, కే బాలవెంకటేశ్వర్లు, యాగంటీశ్వరప్ప, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు ఘంటసాల ఆరాధనోత్సవాలు ముగింపు వేడుకలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, సినీ నిర్మాత బీవీ రెడ్డి, విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య తదితరులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.


డాక్టర్ ఎంకే రామును సత్కరిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, పత్తి ఓబులయ్య, బీఎస్ రావు తదితరులు

టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన గౌరు దంపతులు

కల్లూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని 37వ వార్డు కార్పొరేటర్ అయోషాసిద్దిఖి వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో గౌరు దంపతులు 37వ కార్పొరేటర్‌కు టీడీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానిం చారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో విధ్వంస పాలనకు ప్రజలు చరమగీతం పాడారని, చివరికి కార్పొరేటర్లు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో నంద్యాల తెలుగు యువత జిల్లా అధ్య క్షురాలు కె.పార్వతమ్మ, కర్నూలు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, కార్పొరేటర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేటర్‌కు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గౌరు దంపతులు

రెవెన్యూ ఉద్యోగులకు పదోన్నతులు


నియామక పత్రాన్ని అందుకుంటున్న సందీప్ నాయక్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వీఆర్వో గ్రేడ్-1, జూనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న 57 మంది రెవెన్యూ ఉద్యోగులకు సీనియర్ అసిస్టెంట్లుగా, ఆర్‌ఐలుగా పదోన్నతులు లభించాయి. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పదోన్నతులు పొందిన వారికి కలెక్టర్ రంజిత్ బాషా సంబంధిత పత్రాలను అందజేశారు. వీరికి రెండు రోజుల్లో పోస్టింగ్ కార్యాలయాలను రెవెన్యూ శాఖ అధికారులు కేటాయించనున్నారు. వీరి ద్వారా 41 సీనియర్ అసిస్టెంట్లు, 8 ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్లు, 8 ఆర్ఐ స్థానాలు భర్తీ కానున్నాయి.

పీఎం సూర్యఘర్‌కు స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం

విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం. ఉమాపతి


మాట్లాడుతున్న ఎస్ఈ ఎం.ఉమాపతి

కల్లూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం వినియోగదారులకు చేరువ చేయడానికి స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించనున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన విద్యుత్ భవన్‌లో విద్యుత్ అధికారులు, సోలార్ వెండర్లతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కర్నూలు నగరంలోని ప్రధాన కూడళ్లలో స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు స్పాట్‌లో రిజిస్ట్రేషన్ చేసి లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వినియోగదారులకు గతంలో సోలార్ యూనిట్స్‌కు సెటిల్మెంట్ ప్రతి ఆరు నెలలకు ఒకసారి జరిగేదని, ప్రస్తుతం సీఎం సూర్యఘర్ కింద చేసుకున్న వినియోగదారులకు అదనంగా గ్రిడ్డుకు అందించిన యూనిట్స్‌కు తర్వాతి నెలనే వారి బ్యాంకు అకౌంట్‌లో వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డీఈ ఓబులేసు, కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి, ఎస్ఏఓ చిన్నరాఘవులు అధికారులు పాల్గొన్నారు.



ఆలయం వెలుపల మంత్రులు బీసీ, ఆనం, ఎమ్మెల్యే బుడ్డా

మల్లన్న సేవలో మంత్రులు

శ్రీశైలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను సోమవారం రాత్రి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిలు దర్శించుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేకు దేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు, అర్చకులు రాజగోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఆలయంలోని వేదఆశీర్వచన మండపంలో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు.



మంత్రులను ఆలయ మర్యాదలతో సత్కరిస్తున్న ఈవో శ్రీనివాసరావు, అర్చకులు





మల్లన్న సన్నిధిలో మంత్రులు అనిత, అనగాని

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-కడప జాతీయ రహదారి బొగ్గులైన్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు నాన్సి మేరి (58) మృతి చెందింది. ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జున గుప్త వివరాల మేరకు.. నంద్యాల మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని హనీఫ్ నగర్‌కు చెందిన మూరతోటి అగస్టీన్, నాన్సి మేరి దంపతులు సోమవారం శుభ కార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా బొగ్గులైన్ సమీపంలో వీరి వాహనాన్ని కారు ఢీ కొంది. దీంతో నాన్సి మేరి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ భర్త అగస్టీన్‌ను స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా ప్రాంతాన్ని తాలుకా పోలీసులు పరిశీలించారు. మృతురాలు శిరివెళ్ల మండలం యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లికార్జున గుప్త తెలిపారు.

నగల వ్యాపారికి బెదిరింపు కాల్స్

గూడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారు నగల వ్యాపారికి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయి. సోమవారం బం గారు నగల వ్యాపారి డమాం వెంకటేశ్వర్లు గూడూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిమ్మయ్యకు ఫిర్యాదు చేసారు. గూడూరు పట్టణంలో డమాం వెంకటేశ్వర్లు బంగారు నగల వ్యాపారం చేస్తున్నాడు. గత సంవత్సరం డమాం వెంకటేశ్వర్లును ఒందరు వ్యక్తులు డబ్బుల కోరకు కిడ్నాప్ చేసిన సంఘటన తెలిసిందే. ఆ సంఘటన మరువక ముందే 15 రోజుల నుంచి వీరేష్ అనే వ్యక్తి నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని అంటున్నారని వెంకటేశ్వర్లు ఎస్ఐ తిమ్మయ్యకు ఫిర్యాదు చేసాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి : కలెక్టర్



విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. మినిస్ట్రీ యూత్ అఫైర్స్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రగ్బీ ఉమెన్స్ లీగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు సోమవారం కలెక్టరేట్‌లో ప్రోత్సాహక నగదు, బహుమతులు అందజేశారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు కలుగుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు నంద్యాల ఆర్జీఎం కళాశాలలో జరిగిన పోటీల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల జట్లు పోటీ పడ్డాయనీ, ఇందులో పోటీ పడి కంబలాపాడు, దిన్నెదేవరపాడు, లక్ష్మీపురం, ఆళ్లగడ్డ, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థినులు రూ.2లక్షల ప్రైజ్‌మనీ గెలుచుకున్నారన్నారు. అనంతరం గురుకుల పాఠశాలలో 5వ తరగతి ఇంటర్మీడియట్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, డీఎస్‌డీవో భూపతిరావు, ఏపీ రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

'సబ్సిడీ రుణాల యూనిట్లు పెంచాలి'

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కాపు, బలిజ కులాల వారికి ఇస్తున్న సబ్సిడీతో కూడిన స్వయం ఉపాధి పథకం రుణాల యూనిట్లను పెంచాలని నగర బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గాండ్ల లక్ష్మన్న, రవికుమార్, సంఘం గౌరవ సలహాదారులు సింగంశెట్టి సోమశేఖర్, ఈశ్వరకుమార్‌లు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ప్రజా పరిష్కార వేదికలో కలెక్టర్ పి. రంజిత్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి కాపు కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని బలిజ కులాలకు సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) మూడు యూనిట్లు మాత్రమే కేటాయించారని, జిల్లాలోని బలిజ కులస్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని యూనిట్ల సంఖ్యను పెంచాలని కోరారు. అలాగే దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీని ఈనెల ఆఖరు వరకు పొడిగించాలని, బీసీలు ఈబీసీలతో సమానంగా వయో పరిమితిని 60 ఏళ్లకు పెంచాలని కోరారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీ త్వరితగతిన జరిగేలా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు బలిజ సంఘం నాయకులు తెలిపారు.



వినతిపత్రం ఇస్తున్న బలిజ సంఘం నాయకులు

రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంపు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రూరల్ సీఐ బీవీ మధుసూదన్‌రావు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి నవోదయ విద్యాలయంలో సోమవారం రాజ్యపురస్కార్ టెస్టింగ్ క్యాంపు అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఎమ్మిగనూరు రూరల్ సీఐ బీవీ మధుసుదన్‌రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ క్యాంపు 14వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. 16 నవోదయ విద్యాలయాల భారత్‌స్కౌట్స్, గైడ్స్ 91 మంది, 108 మంది గైడ్స్ విద్యార్థులు వచ్చారని తెలిపారు. భారత్ స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవడం, సౌశీల్య నిర్మాణం, సత్యం పలకడం, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం, రోగగ్రస్తులకు సాయం చేయడం, అత్యవసర సమయాల్లో సహాయ పడడం ద్వారా సమాజ సేవ చేయవచ్చని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ చందిరన్, అధ్యాపకులు శ్రీనివాసరావు, వెంకటేష్, ఎల్‌ఓసీ స్కౌట్స్ బాబురావు, సిబ్బంది మల్లేశ్వరి, అనిల్‌శాస్త్రి, రమేష్, శివకుమార్, శశికిరణ్ పాల్గొన్నారు.

జీడీపీలో 2.128 టీఎంసీలు

- హంద్రీనీవా నుంచి ప్రాజెక్టులోకి రోజుకు 150 క్యూసెక్కులు
- రోజుకు 30 క్యూసెక్కుల నీరు అవిరి



గాజులదిన్నె ప్రాజెక్టులో 2.128 టీఎంసీలుగా నీటి నిల్వ

గోనెగండ్ల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అనుకున్న స్థాయిలో వర్షాలు కురిసి నీరు రాకపోయినప్పటికీ హంద్రీనీవా, ఎల్లెల్సీ నీరు రావడంతో జీడీపీ కళకళలాడుతోంది. దీంతో ఈ ఏడాది వేసవిలో ప్రాజెక్టు కింది తాగునీటి పథకాలకు నీటి కొరత ఉండదని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 2.128 టీఎంసీ నీరు ఉంది. హంద్రీ నీవా నుంచి రోజుకు 150 క్యూసెక్కు నీరు జీడీపీకి వచ్చి చేరుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. జీడీపీ కింది ఈ ఏడాది దాదాపు 12 నుంచి 13వేల ఎకరాల్లో ఆయకట్టు సాగ యింది. చాల మంది రైతులు వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, శనగ, ఆముదాలు, కొర్రను సాగు చేస్తున్నారు. సాగు చేసిన పంటకు సాగు నీరు విడుదల చేస్తున్నారు. అయితే జీడీపీ అధికారులు కుడి, ఎడమ కాలువ నుంచి నీరు వృథా కాకుండా రైతులకు అవసరమైన సమయంలో నీరు విడుదల చేసి నీటిని వృథా కానీయడం లేదు.

తాగునీటి పథకాలకు...

ఈ ఏడాది గాజులదిన్నె ప్రాజెక్టులో ఇప్పటికీ 2.128 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు కింద తాగునీటి పథకాలు బండగట్టు, జీన్, క్రిష్ణగిరి ఉన్నాయి. ఈ పథకాలకు ప్రతి రోజు జీడీపీ నుంచే నీరు విడుదల అవుతోంది. ఈ మూడు పథకాలకు రోజుకు 10 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉంటుంది. అవసర సమయంలో కర్నూలు, కోడుమూరు, గూడురు, బెళగల్, లద్దగిరి, ప్రాంతాలకు నీరు ప్రాజెక్టు నుంచి మళ్లించాల్సి ఉంటుంది.

సాగు నీటి వివరాలు..

ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులు ఈ ఏడాది 12వేల ఎకరాల నుంచి 13వేల ఎకరాల్లోపు పంటలు సాగుచేసుకున్నారు. వారికి అధికారికంగా మార్చి నెల చివరి వరకు నీరు విడుదల చేయాలి. అయితే పంటలు పూర్తిగా చేతికి అందాలంటే ఏప్రిల్ నెల 15 వరకు నీటి విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఏప్రిల్ 15 వరకు నీరు విడుదల చేయాలంటే ఒక టీఎంసీ నీరు అవసరం అవుతుంది. ప్రస్తుతం ఉన్న 2.128 టీఎంసీ నీటిలో ఒక టీఎంసీ పంటలకు పోగా మిగిలిన 1.128 టీఎంసీలలో ఈ వేసవి జూన్ నెల చివరి వరకు తాగునీటి పథకాలకు మరో టీఎంసీ నీరు సరిపోతుందని ఇరిగేషన్ అధికారులు లెక్కలు వేస్తున్నారు. అయినప్పటికీ మరి కొంత నీరు ప్రాజెక్టులో మిగిలి ఉంటుదని అధికారులు తెలుపుతున్నారు. మిగిలిన టీఎంసీ నీరు ఇతరత్ర అత్యవసరాలకు వినియోగించుకోవచ్చునని తెలుస్తుంది.

రోజుకు 30 క్యూసెక్కులు ఆవిరి

ప్రాజెక్టులో నీరు దాదాపు 24 కిలో మీటర్లు పరిధిలో విస్తరించింది. వేసవిలో భూమిలోకి నీరు ఇంకిపోవడం, ఆవిరి రూపంలో కొంత నీరు వృధా కావటం, చూట్టుపక్కల రైతులు పైపులు మోటార్లతో నీటిని వినియోగించుకోవడంతో ఇప్పటి నుంచి రోజకు 30 క్యూసెక్కుల నీరు వృధా అవుతోంది. ఎండవేడిమి పెరిగే కొద్ది నీటి ఆవిరి పెరుగుతోంది. అయినప్పటికీ ఈ ఏడాది ప్రాజెక్టు తాగునీటి పథకాలకు నీటి ఇబ్బంది లేదని అధికారులు తెలుపుతున్నారు.

యాగంటి శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం విడుదల చేశారు. బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ, ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి, ప్రధాన అర్చకులు మహేశ్ తదితరుల ఆధ్వర్యంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరిగే యాగంటి ఉమామహేశ్వ రస్వామి వార్ల కళ్యాణోత్సవం, రథోత్సవం, వసంతోత్సవం, తెప్పోత్సవం పోస్టర్‌ను విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బ్రహ్మోత్సవాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, శంఖేశ్వరరెడ్డి, బత్తుల గోపాల్‌రెడ్డి, సిబ్బంది ప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో విభిన్న సామర్థ్యం గల పిల్లలు, బాలలలో ఆరోగ్య లోపాలతో ఉన్న పిల్లలను గుర్తించడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంటింటి సర్వేను సోమవారం నుంచి ప్రారంభించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ సర్వే ఈ నెల 24 వరకు కొనసాగుతుందని సర్వేలో పారా లీగల్ వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లతో కూడిన బృందాలు సర్వే చేపడుతాయని తెలిపారు. చిన్న పిల్లల్లో అనారోగ్యాన్ని ప్రారంభ దశలోనే గుర్తిస్తే వారికి సత్వర చికిత్స అందించి మంచి బాలలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. సీనియర్ న్యాయవాది జి. నాగేషయ్య, బద్దెల లక్ష్మీనారాయణ, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు



సర్వే ప్రారంభించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

బతికి ఉండగానే చంపేశారు

ఓ రోగి వేదన.. తమకు సంబంధం లేదన్న అధికారులు

ఆంధ్రజ్యోతి ప్రవేశంతో అధికారుల్లో కదలిక

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బతికి ఉండగానే రికార్డుల్లో చనిపోయినట్లు అధికారులు చూపించారు. నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో ఈ ఘటన జరిగింది. అంకగాళ్ల చిన్న లింగమయ్య తన ఆవేదనను ఆంధ్రజ్యోతితో పంచుకున్నాడు. కూలీ పని చేసుకొని జీవించే లింగమయ్య ఆగస్టు 26, 2022లో కర్నూలులోని కిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయిం చుకున్నాడు. ఆయన భార్య సుభాషిణి కిడ్నీ దానం చేసింది. 2022 సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో అయ్యలూరు సచివాలయ సిబ్బంది కర్నూలుకు వచ్చి పింఛన్ ఇచ్చారు. తర్వాత డాక్టర్ల సూచన మేరకు సంవత్సరం పాటు కర్నూలు ఆసుపత్రి సమీపంలో ఉంటూ చికిత్స తీసుకున్నాడు. అనంతరం గ్రామానికి వచ్చి పింఛన్ గురించి నంద్యాల ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి అడిగితే పింఛన్ ఐడీ 1131126203 పరిశీలించి రికార్డులలో 2021 సెప్టెంబర్‌లోనే నీవు చనిపోయినట్లు ఉందని తెలిపారు. సచివాలయంలో అడగగా తమకు సంబంధం లేదన్నారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో కూడా అట్లాగే నమోదై ఉన్నది. తాను బతికి ఉండగానే చనిపోయినట్లు రికార్డుల్లో నమోదు చేశారని, దీంతో రేషన్ రావటం లేదని, ఆరోగ్యశ్రీ కార్డు కూడా రద్దు అవుతుందని లింగము య్య ఆవేదన చెందాడు. ఆరు నెలల నుంచి అధికారులు ఒకరి మీద ఒకరు నెపం వేసుకుంటూ తప్పించుకుంటున్నారని ఆయన అన్నాడు.



బాధితుడు చిన్నలింగమయ్య

దొంగ బంగారం కొనుగోలుపై విచారణ

- వ్యాపారి అరెస్టును అడ్డుకున్న గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు



దుకాణం వద్ద విచారణ చేస్తున్న దోర్నాల పోలీసులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ బంగారు దుకాణదారుడిని దోర్నాల పోలీసులు సోమవారం విచారించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లాలోని దోర్నాల ప్రాంతంలో చోరీలకు పాల్పడిన ఓ దొంగ అక్కడి పోలీసులకు చిక్కాడు. విచారణ చేపట్టగా సుమారు 25 గ్రాముల బంగారాన్ని ఆత్మకూరు పట్టణంలోని కప్పలకుంటలో గల ఎం.వాహీద్ జ్యువెలర్స్ షాపులో విక్రయించినట్లు తేలింది. సోమవారం దోర్నాల ఎస్సై మహేష్ పోలీసు సిబ్బందితో కలిసి బంగారు దుకాణం వద్దకు వచ్చారు. దొంగ వద్ద బంగారు కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరమని అరెస్టు చేయడానికి సిద్ధమయ్యారు. దీంతో గోల్డ్ మర్చంట్ అసోషియేషన్ అధ్యక్షులు ఎంఏ రషీద్‌తో పాటు మిగిలిన బంగారు దుకాణాల యజమానులు షాపులను మూసివేసి అతడిని అరెస్టు చేయకుండా అడ్డుకున్నారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరో దొంగ వచ్చి ఫలానా షాపు అని చూపినంత మాత్రాన వారెంట్ లేకుండా ఎలా అరెస్టు చేస్తారని నిలదీశారు. ఇలా అయితే బంగారు దుకాణాలను కూడా నడపలేని పరిస్థితులు ఉంటాయని అన్నారు. దీంతో పంచాయతీ కాస్త ఆత్మకూరు పోలీసుస్టేషన్ వరకు వెళ్లింది. కాగా ఎంతో కొంత అమౌంట్ చెల్లించి సమస్యను క్లియర్ చేసుకోవాలని సదరు బంగారు దుకాణ యజమాని మంతనాలు జరిపినట్లు తెలిసింది. మొత్తానికి ఈ వ్యవహారంలో దోర్నాల పోలీసుల తదుపరి చర్య ఎలా ఉంటుందన్నది తెలియాల్సి ఉంది.

రసాభాసగా పంచాయతీ సమావేశం

- అక్రమాలు జరిగాయని వైస్ సర్పంచ్ ఆరోపణ
- ఈఓఆర్డీ, కార్యదర్శిపై సభ్యుల ఆగ్రహం

పాణ్యం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పాణ్యం మేజర్ గ్రామపంచాయతీ సమావేశం రసాభాసగా మారింది. సోమవారం పంచాయతీ సమావేశం సర్పంచ్ పల్లవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఉప సర్పంచ్ చంద్రశేఖరరెడ్డి రూ.14 లక్షల గోల్‌మాల్ జరిగిందంటూ ఈవోఆర్డీ, కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు పాణ్యం పంచాయతీకి మంజూరైన 15 ఆర్థిక సంఘం నిధులు, జనరల్ నిధులు, ఇతర నిధుల ఖర్చులను, మిగులును చూపించాలని పట్టుబట్టారు. ప్రతిపాదనలు తయారు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వీధి దీపాలు, వాహనాల డీజల్, జనరల్ ఫండ్ నిధుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఎస్సీ కాలనీలో నీటి సరఫరా సరిగా లేదన్నారు. తాగునీటి వృధాను అరికట్టడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారన్నారు. బస్టాండు సమీపంలోని చర్చి వద్ద అపరిశుభ్రతతో కంపుకొడుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. 2024-25 సంవత్సరానికి మంజూరైన నిధుల వివరాలు వారం రోజులుగా అడుగుతున్నా ఇవ్వడం లేదని ఉప సర్పంచ్ ఆరోపించారు. మంజూరైన పనులకు రెండు పర్సెంటేజీ ఇవ్వాలని, లేని పక్షంలో ఎంబుక్కులో పనులు నమోదు చేయబోమని ఈఓఆర్డీ వేధిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపాదనల రికార్డుల్లో ఖాళీ పేజీలు తయారు చేసి తర్వాత పనులు ఎక్కించుకుంటున్నారన్నారు. గ్రామ సమస్యలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఆనందరావు సమాధానమిస్తూ గత సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 71,82,212 మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో 58.95 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. రికార్డుల్లో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు లేవన్నారు. సర్పంచ్ అనుమతితోనే పనులు చేపడుతున్నామన్నారు. ప్రతి పనికి ఓచర్, బిల్లులు ఉన్నాయన్నారు. ప్రతి రోజూ పరిశుభ్రత, అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈఓఆర్డీ చంద్రమౌళీశ్వర గౌడ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో నిధులు ఉంటేనే ప్రతిపాదనలు తయారు చేసుకోవాలని కార్యదర్శులను ఆదేశించామన్నారు. నిధుల్లో ఎలాంటి అవినీతికి పాల్పడలేదని అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైస్ సర్పంచ్

సమన్వయ లోపం.. విద్యార్థులకు శాపం

- ఈ నెల 2న ఆదర్శ పాఠశాల వసతి గృహంలో ఫుడ్‌పాయిజన్
- అస్వస్థతకు గురైన విద్యార్థులు
- త్రిసభ్య కమిటీ విచారణలో బయటపడ్డ వాస్తవాలు

గడివేముల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వసతి గృహం, పాఠశాల అధికారులు, సిబ్బంది సమన్వయ లోపం విద్యార్థులకు శాపంగా మారింది. ఈనెల 2న కలుషిత ఆహారం తిని ఆదర్శ పాఠశాల వసతి గృహ విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటనపై తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో వాసుదేవగుప్త, ఎంఈవో మేరిసునితల త్రిసభ్య కమిటీ సోమవారం విచారణ చేపట్టారు. వసతి గృహంలోని పరిసరాలను, వంటగదిని, మంచి నీళ్ల ట్యాంకును పరిశీలించారు. వసతి గృహ సిబ్బంది, వార్డెన్, ప్రిన్సిపాల్‌ను ఫుడ్‌పాయిజన్ సంఘటనపై విచారించారు. ఈ విచారణలో అధికారులు, సిబ్బంది సమన్వయ లోపంతో విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారని గుర్తించారు. ఈనెల 2న హాస్టల్‌కు నాసిరకమైన చికెన్ సరఫరా అయినా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వలేదని, వంట సిబ్బంది ఆలస్యంగా వచ్చి ఉడికి ఉడకని చికెన్‌ను విద్యార్థినులకు పెట్టడంతో ఆ ఆహారాన్ని తిని అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థినులకు నిల్వ ఉన్న తాగునీటిని అందించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, డీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగన్న, ఏపీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రలు ప్రిన్సిపాల్, వార్డెన్ సమన్వయ లోపం వల్ల విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని త్రిసభ్య కమిటీకి ఫిర్యాదు చేశారు. త్రిసభ్య కమిటీ సభ్యులు మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.


వంట సిబ్బందితో మాట్లాడుతున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

48 గంటల నిరాహార దీక్ష ప్రారంభం


నిరాహార దీక్షల్లో పాల్గొన్న నాయకులు

పాణ్యం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పాణ్యం మండల సమస్యలపై స్థానిక బస్టాండు కూడలి వద్ద సోమవారం ప్రజా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు ప్రారంభించారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ దీక్షల్లో సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ యాదవ్, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు వెంకటాద్రి, ఎస్ఎస్‌యూఐ నాయకులు రాజుయాదవ్, వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు వనం రాజు, రవీంద్రనాయక్, ప్రతాప్ పాల్గొన్నారు. దీక్షలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ శేషఫణి మద్దతు పలికారు. వారు మాట్లాడుతూ పాణ్యం ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలన్నారు. నూతన బస్టాండు నిర్మాణం చేపట్టి తాగునీరు, మరుగుదొడ్ల ప్రయాణికులు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ మార్కెట్‌ను పునరుద్ధరించాలని, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేయాలని, ఇంటర్, పీజీ విద్యార్థుకు వసతి గృహాలు ఏర్పాటు చేయాలన్నారు. తమ్మరాజుపల్లె, సుగాలిమెట్ట, పాణ్యం డొంగు, బలపనూరు గ్రామాల వద్ద కాలినడక వంతెన ఏర్పాటు చేయాలన్నారు. మోడల్, కస్తూర్బా పాఠశాలలకు నీటి కొరత, రహదారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు రాజునాయుడు, విద్యార్థులు, పల ప్రజాసంఘాలనాయకులు, పాల్గొన్నారు.

దుర్గాభోగేశ్వరుడికి ఏఎస్పీ ప్రత్యేక పూజలు



గడివేముల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో నంద్యాల ఏఎస్పీ యుగంధర్‌బాబు దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

చదరంగం పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు నంద్యాల శాంతినికేతన్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఛైర్మన్ సుధాకర్, ప్రిన్సిపాల్ రమ్యారెడ్డి తెలిపారు. 8వతేదీన నంద్యాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు లక్ష్మీచైతన్యరెడ్డి, సంతోష్‌పవన్, వరుణ్, ఓబులేసు, ఆరిఫ్‌హుస్సేన్, విష్ణు, భరత్, జయకృష్ణ, విష్ణువర్ధన్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం సత్కరించింది.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న డీఈవో జనార్ధన్‌రెడ్డి

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 1-19 సంవత్సరాలలోపు విద్యార్థులకు 97శాతం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేశామని డిఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1597 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, 1099 ప్రైవేట్ పాఠశాలలు, 211 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, 1663 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 4,29,268 మంది విద్యార్థులకు గాను 417341 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని వివరించారు. మిగిలిన విద్యార్థులకు 17న పంపిణీ చేస్తామన్నారు.

నంద్యాల ఎడ్యుకేషన్: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల క్రాంతినగర్‌లోని మోడల్‌స్కూల్‌లో జిల్లా విద్యాశాఖాధికారి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. డీఈవో మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలికలలో రక్తహీనతకు ప్రధాన కారణం నులిపురుగులను కల్గివుండటమే అన్నారు. వీటి నివారణకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చేతిగోళ్లు పెంచరాదని, చేతులను సబ్బు నీటితో శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లీలావతిదేవి, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతారావునాయక్ పాల్గొన్నారు.

పోలియోపై అవగాహనా ర్యాలీ

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు పోలియోపై అవగాహన కల్పిస్తూ రవీంద్ర హైస్కూలు విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, బాలకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పోలియో నిర్మూలన ప్రజల్లో అవగాహన మాత్రమే సాధ్యమవుతుందని, రెండేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని కోరారు. కార్యక్రమంలో బాల అకాడమీ పాఠశాల ఫౌండర్ కొండయ్య, రోటరీ సభ్యులు శ్రీరామమూర్తి, కైలాసనాధరెడ్డి, మాలేపాటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మిడుతూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏడీఏ విజయ శేఖర్ అన్నారు. సోమవారం కార్యాలయ సిబ్బందితో వ్యవసాయ అధికారి పీరునాయక్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ సొంత భూమి కలిగిన ప్రతి ఒక్క రైతు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుకు 11 అంకెలు గల నంబరు వస్తుందని తెలిపారు. ఈ నంబరు వలన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు, రాయితీలు, పురుగుల మందులు, ఎరువులు వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు పొందవచ్చునని ఆయన అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్‌వోలు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి గుడి పునర్నిర్మాణానికి శ్రీకారం


భూమి పూజలో పాల్గొన్న అభిరుచి మధు, టీడీపీ నాయకులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల గోపాల్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం శిథిలావస్థకు చేరింది. ఈ ఆలయాన్ని పగలగొట్టి నూతన ఆలయానికి సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రారావు, బీజేపీ నాయకులు కొట్టె చంద్రశేఖర్, ఉపేంద్ర నాద్ రెడ్డి, ఆంజనేయ స్వామి కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు.

రామాయణం సనాతన ధర్మానికి మార్గదర్శకం


వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి రచించిన రామాయణ సనాతన ధర్మానికి మార్గదర్శకమని వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు జక్కుల శ్రీనివాసులు అన్నారు. మండలంలోని తంగడంచ గ్రామంలో సోమవారం వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జున, వెంకటసుబ్బయ్య, మద్దిలేటి, గౌరీశ్వరనాయుడు, ప్రకాశ్, ఉపేంద్రనాయుడు, పుల్లయ్య, వెంకటరమణనాయుడు, రాముడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి అడ్డాగా మున్సిపల్ కార్యాలయం

మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసీ రెడ్డి

నంద్యాల మున్సిపాలిటీ ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ కార్యాలయాన్ని అధికారులు అవినీతి కార్యాలయంగా మార్చారని ప్రముఖ న్యాయవాది, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ తులసీ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో పైసలిస్తేనే పనులు అధికారులు చేస్తున్నారని అన్నారు. షరీఫ్ అనే వికలాంగున్ని సైతం వేధిస్తున్నారని, ఇది ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సోమవారం మున్సిపల్ ఇంజనీర్ ఒకరు నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న వికలాంగుడు కోళా నాగరాజుపై దాష్టికాన్ని ప్రదర్శించడం వారి అహంకారానికి నిదర్శనమన్నారు. మున్సిపల్ అధికారుల చర్యలతో కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, ఈ విషయాన్ని స్థానిక మంత్రి ఫరూక్‌తో చర్చించి మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణకుకి ఫిర్యాదు చేయడంతో పాటు హైకోర్టులో కేసు వేస్తానని హెచ్చరించారు.

వడ్డెర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వడ్డెర్లను ప్రభుత్వం ఆదుకోవాలని వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య, మంజుల సుబ్బారాయుడు, జనార్దన్, గోపాల్ కోరారు. సోమవారం నంద్యాలలో వారు మాట్లాడుతూ వడ్డెర కులస్తులకు రూ.5 లక్షల వరకు ఈఎండి లేకుం డా నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇవ్వాలన్నారు. ఆర్థికంగా రాజకీయంగా వెనుకబడిన వడ్డెరలకు మైనింగ్ రిజర్వేషన్‌లు కల్పించి, నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

గడివేముల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని డిప్యూటీ రేంజి ఆఫీసర్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని గడిగరేవుల, బూజనూరు గ్రామాల్లో సోమవారం ప్రజలకు ప్రతాప్ బృందం ఆధ్వర్యంలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై కళాజాత నిర్వహించి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వన్యప్రాణులకు హాని తలపెట్టవద్దని అన్నారు. అడవుల్లో నిప్పు పెట్టకూడదని అన్నారు. అటవీ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో అబ్దుల్‌కలామ్, జమాల్‌వలి, గడిగరేవుల సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ గోద ప్రసాద్ పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించాలి

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ సూచించారు. సోమవారం మండలంలోని ఏ కోడూరు రైతు సహకార పరపతి సంఘంలో డీఏవో ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఎరువుల స్టాక్, డీబీటీ, బిల్లు రిజిష్టర్లను ఆయన తనిఖీ చేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ యూరియా పొలానికి మోతాదుకు మించి వేయటం వల్ల తెగుళ్ల పెరుగుతాని, భూమి సారవంతం దెబ్బ తింటాయని అన్నారు. సేంద్రీయ ఎరువుల వాడకం పెంచాలని తద్వారా భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. యూరియా ఎక్కువ వేస్తే పైరు పెరుగుతుందని వాడటం సరికాదన్నారు. అనంతరం గ్రామంలోని ఆర్బీకేలో రైతుల విజిట్ రిజష్టర్‌ను డీఏవో పరిశీలించారు. వెంట ఏవో స్వాతి, సీఈవో శ్రీనువాసులు, వీఏఏ పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మైనర్ డ్రైవింగ్ సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జున గుప్త తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 24 కేసులు నమోదు చేశామన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు మొత్తం రూ.26,295 జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనర్లు డ్రైవింగ్ చేయడంవల్ల కలిగే తీవ్రమైన పరిణామాలను వారికి వివరించామన్నారు. చట్టపరమైన చిక్కులు, ప్రమాదాలు, మైనర్లకు, ప్రజలకు సంభవించే ప్రమాదాలను తెలియజేశారు.

16 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

వన్‌టౌన్ పోలీసులు సోమవారం నెంబర్‌ప్లేట్లు లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నెంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలు ఉపయోగించి నేరస్తులు ఏదైనా నేరం చేస్తారనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. నెంబర్‌ప్లేట్లు లేని 16మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఎవరైనా నెంబర్‌ప్లేట్ లేని మోటార్‌సైకిళ్ల, ఆటోలు, మరి ఏ ఇతర వాహనాలను నడపరాదన్నారు.

మా బియ్యం ఎక్కడికి పోయాయి..?

- డీలరును నిలదీసిన లబ్ధిదారులు

పగిడ్యాల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : నెహ్రూనగర్ గ్రామంలోని 15వ రేషన్ షాపులో 30కేజీలకు 20కేజీలు, 20కేజీలు ఇచ్చేచోట 10కేజీలు ఇవ్వడంతో సోమవారం బాధితులు డీలర్‌పై అనుమానం వచ్చింది. మా వాటా బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నావా అంటూ నిలదీశారు. అయితే రేషన్‌షాపుకు తక్కువ బియ్యం బస్తాలు రావడంతో తక్కువ వేస్తున్నానని డీలర్ చెప్పారు. రేషన్‌కార్డుదారులు విషయాన్ని తహసీల్దార్ శివరాముడు దృష్టికి తీసుకెళ్లారు. బియ్యం ఎందుకు తక్కువగా ఇచ్చారో విచారించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్యం దుకాణాలు వీరికే..

నందికొట్కూరు, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): గీత కులాలకు మద్యం దుకాణాలను లాటరీ ద్వారా ఎంపిక చేసినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ సి.ఐ. రామాంజనేయులు తెలిపారు. నందికొట్కూరులో లక్ష్మసారి రవీంద్రగౌడ్, జూపాడుబంగ్లాలో సోమఅశోక్, పగిడ్యాలలో చంద్రశేఖర్ గౌడ్‌లకు మద్యం దుకాణాలు దక్కాయని ఆయన తెలిపారు.

పేదలకు అన్యాయం చేస్తే ఊరుకోం


పట్టణంలో ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): షరతుల పేరుతో పేదలకు అన్యాయం చేస్తే ఊరుకోమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం నందికొట్కూరు సీపీఎం పార్టీ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అర్హులైన పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలాలు ఇచ్చి పక్కా గృహాల నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలని ధర్నా చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చే సంక్షేమ పథకాలను అనేక షరతులు పెట్టి అమలు చేస్తుందని ఆయన ఆరోపించారు. 300 యూనిట్లు కరెంటు దాటిన వారికి, ఫోర్ వీలర్స్ ఉన్న, భూమి ఉన్న, ఇల్లు పెద్దగా ఉన్న సంక్షేమ పథకాలు తొలగిస్తున్నారని ఆయన ఆరోపించారు. బతుకుతెరువు కోసం నాలుగు చక్రాల వాహనం, ఆటో తదితర వాహనాలను కొని జీవనం సాగిస్తున్న వారిని అనర్హులుగా ప్రకటించడం బాధాకరమన్నారు. కర్నూలు రోడ్డులోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్‌లో 2009 నుంచి 300 మంది పేదలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని, వారికి పక్కా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఫక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, ఎస్.ఉస్మాన్, కొంగర వెంకటేశ్వర్లు, సంపంగి వెంకటేశ్వర్లు, దూదేకుల బాబు, తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో పేదలకు ఇళ్లస్థలాలు మూడు సెంట్లు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేసి తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను ముట్టడించారు. సీపీఐ నాయకులు రఘురామమూర్తి, శ్రీనివాసులు, రమేష్‌బాబు మాట్లాడుతూ భూకబ్జా చేసిన వారి చేతుల్లో ఉన్న భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. చాబోలు, 80బన్నూరు, కొత్తసిద్ధేశ్వరంలో ఉన్న గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం ఆగదని అన్నారు. అనంతరం ఎంపీడీవో గోపికృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌లకు డిమాండ్‌తో కూడిన వినతిపత్రం అందజేశారు.

దెబ్బతిన్న పంట పరిశీలన

గడివేముల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ పరిశ్రమ కాలుష్యం ద్వారా దెబ్బతిన్న పంటలను సోమవారం తహసీల్దార్ వెంకటరమణ, మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డిలు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పరిశ్రమ కాలుష్యం వల్ల పంటలు పండటం లేదని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బిలకలగూడురుకు చెందిన 15 మంది రైతులు, బూజనూరుకు చెందిన 18 మంది పొలాలను పరిశీలించారు. పంట నష్టంపై నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందిస్తామని అధికారులు తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

నందికొట్కూరు, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో జీవనజ్యోతి స్కూల్ సమీపంలోని పగిడ్యాల, ముచ్చుమర్రి వై జంక్షన్‌లో శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. గత రెండు రోజులుగా పూజలు అందుకున్న వినాయకుడు, ఆంజనేయస్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠ కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, కొణిదేల శ్రీమల్లికార్జునస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిత్తా జయసూర్య, నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని పూజలు నిర్వహించారు. హరిహరపురం ఆదిశంకరాచార్య శారదా లక్ష్మీనరసింహ పీఠాధిపతులైన సచ్చిదానంద సరస్వతి మహాస్వామి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రోడ్డులో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని అలాంటి ఘటనలు జరగకుండా ఆంజనేయస్వామి ప్రజలుకు ఆశీస్సులు ఉండాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠలు సమాజ హితాన్ని కోరుతాయన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ నాయకులు పలుచాని మహేశ్వరరెడ్డి, రవీంద్రారెడ్డి, ఆర్జు శ్రీనివాసులు, రజినికాంత్‌రెడ్డి, వడ్డె శ్రీనివాసులు పాల్గొన్నారు.

దైవానుగ్రహం కావాలంటే మనస్సు ప్రశాంతంగా ఉండాలి

దైవానుగ్రహం కావాలంటే మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవాలని హరిహరపురం ఆదిశంకరాచార్య శారదా లక్ష్మీనరసింహ పీఠాధిపతులైన సచ్చిదానంద సరస్వతి మహాస్వామి భక్తులకు సూచించారు. సోమవారం పట్టణంలోని గాయత్రీదేవి అమ్మవారి దేవాలయంలో సనాతన హిందూ ధర్మంపై హితబోధ చేశారు. భక్తులకు శివమాలలు వేసి ఆశీర్వదించారు. స్వామి వారిని ఎమ్మెల్యే గిత్తాజయసూర్య, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ గౌరు వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. దైవానుగ్రహాన్ని ప్రయత్నపూర్వకంగా సాధించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పట్టణంలోని భక్తులు పాల్గొన్నారు.


ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, సచ్చిదానంద సరస్వతి మహాస్వామి

కన్నుల పండువగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు


సాయిబాబా మందిరంలో రుద్రహోమాల్లో పాల్గొన్న దంపతులు

డోన్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలోని సాయిబాబా మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు కన్నుల పండుగగా కొనసాగుతున్నాయి. సోమవారం షిరిడీ సాయిబాబా మందిరం ప్రాంతంలో గణపతి, రుద్రహోమాలు జరిగాయి. 12మంది దంపతులు పాల్గొన్నారు. అలాగే షిరిడీ సాయిబాబా మందిరంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శివుడు, దత్తాత్రేయ స్వామి, విఘ్నేశ్వరస్వామి, లక్ష్మి దేవి మూలవిరాట్ విగ్రహాలకు పురోహితులు అభిషేకాలు పూజలు చేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

● బహుమతులు అందజేసిన ధర్మవరం సుబ్బారెడ్డి


చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్యప్రదర్శనలు భక్తులను ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి దంపతులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో షిరిడీ సాయిబాబా ఆలయ సేవ సమితి సభ్యులు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళికృష్ణగౌడు, సభ్యులు చాటకొండ శ్రీనివాసులు, కొండా సురేష్, పార్థసారధి, శ్రీరాములు, ఆలా మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

సాయిబాబా మందిరానికి విరాళం

డోన్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపంలోని నిర్మాణం పూర్తి చేసుకున్న షిరిడీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి దాత రూ.10 లక్షల విరాళాన్ని ప్రకటించారు. యుఎస్‌ఏలో ఉన్న ఎస్‌కే ఇంటర్నేషనల్ గ్రూప్ సీఈవో కిషన్ కవికొండల అనే దాత డోన్ షిరిడి సాయిబాబా మందిరంలోని వెండి మకర తోరణానికి విరాళాన్ని ప్రకటించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చాగలమర్రి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. సోమవారం చాగలమర్రి గ్రామంలోని 7వ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదిక

చాగలమర్రి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. 90 రోజుల ఉపాధి పనిదినాల బాధ్యతలను తమకు లేకుండా చూడాలని పీఆర్ ఇంజనీర్ సహాయకులు ఎంపీడీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, ఏపీఎం నాగమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపులను అందుబాటులోకి తెస్తున్నాం

రుద్రవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : చేతిపంపులను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 సచివాలయాలు, 21 గ్రామ పంచాయతీల పరిధిలో 240 చేతిపంపులు ఉన్నాయన్నారు. వీటిలో 227 చేతిపంపులు పనిచేస్తున్నాయన్నారు. మిగిలిన 13 చేతి పంపులు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్రాస్ ప్రోగ్రాం కింద ప్రతి చేతిపంపు హ్యాండిల్‌కు గ్రీస్ ఏర్పాటు చేస్తున్నామని ఏఈ తెలిపారు.

మాలల యుద్ధ గర్జనకు తరలిరండి

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కర్నూలు పట్టణంలో ఈ నెల 23న నిర్వహిస్తున్న రాయలసీమ మాలల యుద్ధ గర్జనకు తరలి రావాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు కోగిల ప్రసాద్ కోరారు. మండల కేంద్రంలో దళిత కాలనీలో సోమవారం కరపత్రాలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు దశమి ప్రసాదు, సాత్రి రాజు, రవి, దాసు, ఓబులేసు ఉన్నారు.

ఘనంగా యాగంటిలో పల్లకి సేవ


యాగంటిలో పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవ వేడుకలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో శ్రీ ఉమా మహేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకి సేవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

జ్వాలా, ప్రహ్లాద వరద స్వామికి విశేష పూజలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : అహోబిలం లక్ష్మీ నృసింహస్వామి పార్వేట పల్లకిలో కొలువైన జ్వాలా, ప్రహ్లాదవరద స్వామి ఉత్సవమూర్తులకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి పార్వేట పల్లకి సోమవారం ఉదయం సర్వాయిపల్లె గ్రామం నుంచి ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంపీడీవో కార్యాల యంలోని తెలుపు వద్ద కొలువుదీరడంతో పలువురు అధికారులు, ప్రజ లు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్వేట పల్లకి చింతకుంట గ్రామానికి చేరుకుంది.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

దొర్నిపాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కవిత (14) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఉపాధ్యాయుల తరపున రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నగిరి సుధాకర్, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయండి'

బనగానపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నివసించే ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు పూలరాజు కోరారు. సోమవారం బనగానపల్లె తహసీల్దారు నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పలువురు ఎస్సీ, నేతలు పాల్గొన్నారు.

పొగమంచు దెబ్బ

● మామిడి రైతులు విలవిల
● రాలుతున్న పూత, పిందె
● దిగుబడిపై ప్రభావం చూపుతుందంటూ ఆందోళన


రుద్రవరం సమీపంలో నల్లగా మారిన మామిడి పూత

రుద్రవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏడాదిగా మామిడి కాపుపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పదిరోజుల క్రితం పొగ మంచు ఎడతెరిపి లేకుండా కురిసింది. దాంతో మామిడి రైతులు విలవిల్లాడిపోయారు. పొగ మంచు కురియడంతో మామిడి పూత ఎర్రగా, నల్లగా మారి రాలిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది పొడవునా ఎనిమిది సార్లు మందుల పిచికారి చేయించి అష్టకష్టాలు పడితే ప్రకృతి మామిడి ఆశలపై నీళ్లపోసింది.

500 ఎకరాల్లో మామిడి తోటలు

రుద్రవరం మండలంలో సుమారు 500 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి రుద్రవరం, వెలగలపల్లె, ఆలమూరు, చిత్రేణిపల్లె, పెద్దకంబలూరు, చిన్నకంబలూరు, పేరూరు, కోటకొండ, శ్రీరంగాపురం, డి.కొట్టాల ఇంకా పలు గ్రామాల్లో మామి డి తోటలు రైతులు సాగు చేశారు. ఏడాదికి ఒక పంట మాత్రమే వస్తుంది, ఏడాది పొడవునా కంటికి రెప్పలా తోటలను కాపాడుకుంటూ వచ్చామని, తీరా పొగమంచు రూపంలో ప్రకృతి దాడి చేసిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడిపై ప్రభావం

పొగమంచు వల్ల పూత, పిందె రాలిపోవడంతో దిగుబడి తగ్గిపోతుందని రైతులు వాపోయారు. ఆశించిన దిగుబడి రాదని, తోటలకు పెట్టిన పెట్టుబడులు చేతికందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరా రూ. 40వేల నుంచి రూ. 60వేలు చెల్లించి మామిడి తోటలను సన్న, చిన్నకారు రైతులు కౌలుకు తీసుకున్నారు. ఎన్నో ఆశలు పెట్టుకుంటే పొగమంచు నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సారి తీవ్రంగా దిగుబడి తగ్గే ప్రమాదం ఉందంటున్నారు.

కొంపముంచిన పొగమంచు



మూడెకరాలు కౌలుకు తీసుకుని మామిడి తోట సాగు చేశా. మామిడి కాపుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. పొగమంచు దాడి చేయడంతో పూత, పిందె రాలిపోయింది. ఆశలు అడియాశలయ్యాయి.

- ఉసేనీ, మామిడి కౌలు రైతు, రుద్రవరం

ప్రకృతి దాడిలో నష్టపోయాం



ప్రకృతి దాడిలో నష్టపోయాం. పదిరోజుల క్రితం పొగమంచు విపరీతంగా కురిసింది. తోటల్లో పూత పిందె రాలిపోయాయి. పొగమంచు మామిడి తోటలో ఆశలను నాశనం చేసింది.

- అంజి, మామిడి కౌలు రైతు, రుద్రవరం

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: మంత్రి


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మండలంలోని కైప గ్రామంలో రూ.2.20 కోట్లతో వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను మంత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా కైప గ్రామ ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఈ నేపథ్యంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా పనులు చేపట్టాలన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రఘునాథరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందే

● ఇచ్చిన హామీలను అమలు చేయాలి
● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు



తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తున్న సీపీఐ నాయకులు

డోన్ టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరితగతిన నెరవేర్చి, పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి సొంతింటిని నిర్మించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కే.నాగమణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జగన్ మోహన్ రెడ్డి కొండలు, గుట్టలు, వాగులు, వంకల్లో, శ్మశాన వాటికల్లో పేదలకు సెంటు స్థలం ఇచ్చి.. ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలను నిర్లక్ష్యం చేసే మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన మాదిరిగా ఇంటికి పంపిస్తామని హెచ్చరించారు. క్యాబినెట్‌లో తీర్మాణం చేసి జీవో జారీ చేశారని, వెంటనే మార్గదర్శకాలను ఇవ్వాలని కోరారు. ఇచ్చిన హామీల మేరకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు పేదలకు స్థలాలు ఇచ్చేవరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు సుంకయ్య, మోటరాముడు, నారాయణ, రామ్మోహన్, రణత్ యాదవ్, హరికృష్ణ, పృథ్వీ కుమార్, పుల్లయ్య, అబ్బాస్, లక్ష్మిదేవి, అమృతరెడ్డి, ప్రమీళ, షబానా, మాధవి పాల్గొన్నారు.

క్రీడాకారులకు సహకారం అందిస్తా: బీసీ ఇందిరమ్మ


బహుమతులు అందిస్తున్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు, క్రీడాకారులకు తనవంతు సహకారం అందిస్తామని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో కే.శే.పుల్లారెడ్డి జ్ఞాపకార్థం 15 రోజుల నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. జిల్లానుంచి 43 టీంలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి కనబరిచి తమ ప్రతిభను కనబరచాలన్నారు. క్రీడాకారులకు బీసీ కుటుంబం అండగా ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు బనగానపల్లెలో నిర్వహిస్తామన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. టోర్నమెంట్‌లో ప్రథమ విజేతగా నంద్యాలకు చెందిన రాయలసీమ కింగ్ టీంకు రూ.30వేలు సొంత నిధులు పంపిణీ చేశారు. అలాగే బనగానపల్లె ఆర్గనైజింగ్ టీం ద్వితీయ విజేతగా నిలిచింది. వీరికి బీసీ ఇందిరమ్మ నగుదు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బనగానపల్లె పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, టీడీపీ నాయకుడు కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, జీత్‌కుమార్, అధిక సంఖ్యలో వివిధ నియోజకవర్గాలనుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.


వాహనాల తనిఖీ

డోన్ టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో రూరల్ సీఐ సీఎం రాకేష్ సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక లోడు, డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ లేని వాహనాలు గుర్తించి జరిమానా విధించామని తెలిపారు. మొత్తం 21 వాహనాలను తనిఖీ చేసి వాహనదారులకు జరిమానాలు విధించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు గోపాల్, గౌస్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పోర్టల్‌లో రైతు నమోదు తప్పనిసరి

డోన్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు తప్పనిసరిగా ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతు నమోదు కార్యక్రమం ప్రారంభమైనట్లు తెలిపారు. రైతులు ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ లింక్ ఫోన్ నెంబర్ రైతు సేవా కేంద్రంలో ఇవ్వాలన్నారు. వీటి వల్ల విశిష్ట గుర్తింపు సంఖ్య వచ్చి రైతులు పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ పరికరాల రాయితీలకు అర్హులవుతారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం


హాజరైన యువ జగత్ విఖ్యాత్‌రెడ్డి

శిరివెళ్ల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : శిరివెళ్లలో అన్నపూర్ణ విశాలక్ష్మి సమేత బసవేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రాతఃకాల అభిషేకములు, లక్ష్మీ గణపతి, రుద్ర హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. పార్వతీ పరమేశ్వర ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా కల్యాణం, గ్రామోత్సవం నిర్వహించారు. టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి బసవేశ్వర స్వామి ఆలయంలోని స్పటిక లింగానికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. నాయకులు కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, యామా గుర్రప్ప, కందూరి నవీన్ కుమార్, బీసీ ఫిదా హుసేన్, పీవీ లింగమయ్య, యామా శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు భాగస్వాములు కావాలి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ లలిత

బనగానపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నియంత్రణకు విద్యార్థులు భాగస్వాములు కావాలని బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లలిత అన్నారు. సోమవారం బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీకళాశాలలో డ్రగ్స్ ఫ్రీ ఏపీ యూనిట్ నోడల్ అధికారి కౌసల్యాదేవి ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులను రెండు భాగాలుగా విభజించి పోటీ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచడానికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి డ్రగ్స్ నియంత్రణకు సహకరించి సమాజాభివృద్ధికి పాటు పడాలని కోరారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ లలిత, కౌసల్యాదేవి ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మధుసూదన్

ప్యాపిలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మధుసూదన్ అన్నారు. సోమవారం పట్టణంలోని కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల దోపిడీలు మితిమీరాయన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఓటీపీలు, ఆధార్ నెంబర్లు చెప్ప కూడదన్నారు. దీని వల్ల తమ బ్యాంకు ఖాతాలోని డబ్బులను ఖాజేసే అవకాశాలున్నాయన్నారు. విద్యార్థులు సైబర్ నేరాలపై జాగ్రతగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

తెలుగుగంగ వరప్రదాయిని

- టీజీపీ డీఈ వెంకటరమణ



చాగలమర్రి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ రైతులకు వరప్రదాయిని అని టీజీపీ డీఈ వెంకటరమణ అన్నారు. చాగలమర్రి మండలంలో 12 వేల ఎకరాలకు సాగునీరు పారుతోంద న్నారు. సోమవారం ఆంధ్రజ్యోతితో డీఈ మాట్లాడారు.

ప్రశ్న: తెలుగుగంగ ఏ ప్రాజెక్టుల ద్వారా నీటి సరఫరా అవుతోంది?

జవాబు: కృష్ణా జలాలు శ్రీశైలం చేరి తద్వారా బానకచర్ల, అక్కడి నుంచి వెలుగోడు ద్వారా తెలుగుగంగకు సరఫరా అవుతాయి. సున్న కి.మీ నుంచి 96 కి.మీ వరకు నీరు ప్రవహిస్తుంది. అక్కడి నుంచి కడప జిల్లా వైపు ప్రవహిస్తుంది.

ప్రశ్న: వెలుగోడు రిజర్వాయర్‌లో నీటి పరిస్థితి ఏమిటి?

జవాబు: వెలుగోడు రిజర్వాయర్ నుంచి టీజీపీ ప్రధాన కాలువకు నీటి సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం వీబీఆర్‌లో 9 టీఎంసీల నీరు ఉంది.

ప్రశ్న: తెలుగుగంగ కాలువలో నీటి ప్రవాహం ఎంత?

జవాబు: వీబీఆర్ నుంచి ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోని 96 కి.మీ వరకు ఆయకట్టు రైతులకు బ్లాక్‌చానల్ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. చిన్నవంగలి సమీపంలోని గేట్ల వద్ద నుంచి కడప జిల్లాకు సాగునీరు విడుదల చేస్తున్నాం. బ్రహ్మసాగర్‌కు 25 టీఎంసీల నీటిని పంపించాం.

ప్రశ్న: మండలంలో ఎన్ని ఎకరాలకు సాగునీరు అందుతుంది?

జవాబు: ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోని చాగలమర్రి మండలంలో 12 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నాం. ప్రస్తుతం వారాబంది ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: తెలుగుంగ పరిధిలో ఎన్ని చెరువులు ఉన్నాయి?

జవాబు: ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలో తెలుగుగంగ కింద 16 చెరువులు ఉన్నాయి. ప్రతి ఏడాది టీజీపీ ద్వారా చెరువులకు నీరు నింపుతున్నాం.

ప్రశ్న: కాలువ మరమ్మతు పనులు చేపడుతున్నారా?

జవాబు: టీజీపీ ప్రధాన కాలువతో పాటు డిస్ట్రిబ్యూటర్లు, ఈటీలు, బ్లాక్‌చానల్ మరమ్మతులు చేయుటకు రూ.25 కోట్లతో ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరైతే పనులు చేపడతాం.

ఉద్యోగి ఔదార్యం

- రూ.1.5 లక్షలతో పాఠశాలలో బోరు ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు


బోరును పరిశీలిస్తున్న లక్ష్మానాయక్

ప్యాపిలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఓ ఉద్యోగి ఔదార్యం చాటారు. రూ.1.5 లక్షలు వెచ్చించి ఆశ్రమ పాఠశాలలో బోరు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థినులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని సీతమ్మతండాలో బాలికల ఆశ్రమ పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో దాదాపు 60 మంది బాలికలు ఉన్నారు. పాఠశాలలో రెండు బోర్లు ఉన్న అవి అడుగంటిపోయాయి. దీంతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి వచ్చేది. అదే గ్రామానికి చెందిన లక్ష్మానాయక్ డోన్ సబ్ ట్రెజరీలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. తన ఊరులోని ఆశ్రమ పాఠశాలలో నీటి సమస్య ఉందని తెలుసుకున్న లక్ష్మానాయక్ తన సొంత నిధులను వెచ్చించి పాఠశాలలో బోరు వేయించారు. దీంతో పాఠశాల విద్యార్థినులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



వ్యక్తిగత మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు, సర్పంచ్ సుమలత

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మన చుట్టు ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రామ్‌కో పరిశ్రమ యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు అన్నారు. మండలంలోని కల్వటాల, కోటపాడు గ్రామాల్లో రామ్‌కో పరిశ్రమ సామాజిక బాధ్యతలో భాగంగా నిర్మించిన 50వ్యక్తిగత మరుగుదొడ్లను యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు సోమవారం ప్రారంభించారు. రూ.25లక్షల నిధులు వెచ్చించి, ప్రజల ఆరోగ్యం కోసం ఆధునాతన టెక్నాలజీతో మరుగుదొడ్లు నిర్మించారు. రామ్‌కో అడ్మిన్ హెడ్ రామరాజు, కల్వటాల గ్రామ సర్పంచ్, టీడీపీ నాయకులు కామిని సుమలత, క్రిష్ణరంగారెడ్డి దంపతులు, రామ్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

క్లోరినేషన్ యూనిట్ ఏర్పాటు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తాగునీటి క్లోరినేషన్ కోసం ఓవర్‌హెడ్ ట్యాంకుల వద్ద ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మండల ఆర్‌డబ్ల్యూయూఎస్ ఏఈ కరీముల్లా వెల్లడించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో క్లోరినేషన్ యూనిట్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరాముడు, స్థానిక నాయకులు ఉన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లలో శిశు ఆధార్ నమోదు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సెంటర్లలో శిశు ఆధార్ సెంటర్లు సోమవారం ప్రారంభించారు. అంగన్‌వాడీ సెంటర్లలో విద్యనభ్యసించే చిన్న పిల్లల కోసం ప్రభుత్వం ఈ-శిశు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. నమోదు చేసుకున్న వెంటనే ఆధార్ కార్డు మంజూరవుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ కోరారు. సోమవారం ఎంపీడీవో వరప్రసాదరావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు వారాలుగా ఉపాధి కూలీలు పనులు చేసినా బిల్లులు పడకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు రాములమ్మ, దిబ్బరాజు, శాంతమ్మ, జయమ్మ, దేవి, హనుమంతు, బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో విద్యార్థి ప్రతిభ

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జ్యోతి విద్యానికేతన్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఎం.గురువరుణ్ రెడ్డి రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ సవిత్‌నాథరెడ్డి, ప్రిన్సిపాల్ సింధూర తెలిపారు. సోమవారం విద్యార్థిని శాస్త్ర కళాశాల ఏజీఎం డీవీ క్రిష్ణారావు, కరస్పాండెంట్ సవిత్‌నాథరెడ్డి, ప్రిన్సిపాల్ సింధూర అభినందించారు.